

కథా కౌముది

నిశ్శబ్ద సాక్షి

శ్రీనివాస్ మంత్రిప్రగడ

రాత్రి పదకొండు దాటింది. హైదరాబాదులోని ఆ హై రైజ్ అపార్ట్మెంట్ పద్దెనిమిదో అంతస్తులో కిటికీ బయట లైట్లు మెరిసిపోతున్నాయి. లోపల మాత్రం కాంతి ఉన్నా జీవం లేదు. రఘు ల్యాప్‌టాప్ మూసి డైనింగ్ టేబుల్ దగ్గరికి వచ్చాడు. టేబుల్ మీద స్టీల్ డబ్బాలో చల్లారిపోయిన చపాతీలు. పక్కనే భార్య సౌమ్య పెట్టిన చిన్న నోట్ – “మీటింగ్ ఉంది. తినేసి పడుకో.”

వాట్సాప్‌లో గ్రీన్ టిక్‌లు కనిపిస్తున్నాయి కానీ ఇంట్లో మాటలు కనిపించడం మానేసి చాలా రోజులయ్యింది.

హాల్లో టీవీ మ్యూట్‌లో నడుస్తోంది. స్క్రీన్ మీద ఎవరో నవ్వుతున్నారు. ఇంట్లో మాత్రం శబ్దం లేదు. బెడ్‌రూమ్ తలుపు కొద్దిగా తెరిచి ఉంది. లోపల సౌమ్య హెడ్‌ఫోన్స్ పెట్టుకుని ల్యాప్‌టాప్ ముందు కూర్చుంది. పక్కనే వాళ్ల కొడుకు విహాన్ ట్యాబ్ చేతిలో పట్టుకుని నిద్రపోయాడు.

రఘు ఒక్కసారి ఆగి వాళ్లిద్దరినీ చూశాడు. అదే ఇంట్లో ముగ్గురు మనుషులు. కానీ ముగ్గురూ ముగ్గురు వేర్వేరు ప్రపంచాల్లో ఉన్నట్టుంది.

అతను బాల్కనీ దగ్గరికి వెళ్లి నిలబడ్డాడు. కింద రోడ్డు మీద కార్ల లైట్లు వరుసగా కదులుతున్నాయి. ఆ కాంతులు చూస్తుండగానే అతనికి ఒక్కసారిగా తన బాల్యం, కుటుంబ జీవితం, రాజమండ్రి అన్నీ గుర్తుకు వచ్చాయి. ఇప్పటి తన జీవితం ఆ రోజులకంటే ఎన్నో రెట్లు బాగుంది – కానీ అది ఇల్లులా లేదు. ఏదో స్టార్ హోటల్ లో హాలిడే కోసం వచ్చినట్టుంది. అన్నీ బాగుంటాయి కానీ మనవిలా అనిపించవు.

వర్షాకాలం. గోదావరి గాలి తడిగా వీధుల్లో తిరుగుతోంది. చిన్న రఘు షార్ట్ వేసుకుని బయట వానలో తడుస్తున్నాడు. ఇంటి ముందు మట్టి. వాననీళ్లలో కాగితపు పడవలు వదులుతున్నాడు.

"రఘూ... జలుబు వస్తుంది రా!" అంటూ తల్లి అరుస్తోంది.

అతను విననట్టే ఇంకో పడవ వదిలాడు.

కొద్దిసేపటికి నాన్న బయటికి వచ్చి అతని చెయ్యి పట్టుకున్నాడు.

"రా లోపలికి."

"ఇంకో పడవ మాత్రమే నాన్న..."

నాన్న కోపంగా చూసినట్టు చేసి, చివరికి తానే వంగి ఒక పెద్ద కాగితం తీసుకుని పడవ మడిచాడు.

"ఇది గెలుస్తుంది చూడు" అన్నాడు.

ఇద్దరూ వానలో కూర్చుని ఆ పడవ నీళ్లలో వెళ్లడం చూస్తూ నవ్వుకున్నారు.

రాత్రికి కరెంట్ పోయింది. ఇంటి బయట మెట్ల మీద అందరూ కూర్చున్నారు. తల్లి చేతితో విసిరే వీచిక గాలి. దూరంగా రైలు హారన్. పక్కింటి వాళ్లు కూడా వచ్చి కూర్చున్నారు.

"ఈ మధ్య మీ అబ్బాయి చాలా అల్లరి చేస్తున్నాడు, అని పక్కింటి ఆంటీ నవ్వుతూ చెప్పింది.

"అల్లరి చేయకపోతే పిల్లాడా?" అని నాన్న అన్నాడు.

అందరూ నవ్వారు.

అప్పుడు రఘుకి ప్రపంచం అంటే ఇదే అనిపించేది — రాత్రిళ్లు బయట కూర్చుని మాట్లాడుకునే మనుషులు, కారణం లేకుండా నవ్వులు, ఎవరు తిన్నారో చూసుకునే తల్లి, కోపంగా ఉన్నా ఉదయానికి టీ పెట్టే నాన్న.

ఇలా ఆలోచించడం ప్రోగ్రెస్ ని కాదనడం అంటారని సౌమ్య ఈ మధ్య మాట్లాడిన కాసిని మాటల్లోనే కామెంటు విసిరింది.

"నాన్నా..."

విహాన్ పిలుపుతో రఘు ఆలోచనల నుంచి బయటికి వచ్చాడు.

"హమ్?"

"రేపు స్కూల్లో ఫ్యాన్సీ డ్రెస్. నేను ఏమవ్వాలి?"

రఘు కొద్దిసేపు ఆలోచించాడు.

"నీకు ఏం అవ్వాలని ఉంది?"

విహాన్ భుజాలు ఎగరేశాడు.

"అందరూ సూపర్ హీరోలే అవుతున్నారు."

"అయితే నువ్వు సైకిల్ మెకానిక్ అవ్వు" అన్నాడు రఘు నవ్వుతూ.

విహాన్ మొహం పెట్టాడు.

"అది ఎవరు అవుతారు నాన్నా..."

అంతే. రఘు మౌనంగా అయిపోయాడు. ఈ ప్రపంచంలో ఇప్పుడు గౌరవం కూడా గ్లామర్ ఉన్న పనులకే దక్కుతుందని అతనికి అనిపించింది.

మరుసటి రోజు ఆఫీసులో "వెల్‌నెస్ వీక్" ప్రారంభమైంది. గోడలన్నీ రంగురంగుల పోస్టర్లతో నిండిపోయాయి.

"స్లో డౌన్ టు గ్రో ఫాస్ట్."

"బ్రీత్. రిలాక్స్. రీసెట్."

అదే గోడపై మరో పోస్టర్ —

"బీ అగ్రెసివ్. బీట్ ది టార్గెట్స్."

మనం కార్పొరేట్ ఉద్యోగులను తయారుచేస్తున్నామా సైనిక శిక్షణ ఇస్తున్నామా? అనుకున్నాడు రఘు

సైనిక శిక్షణలో ఇంతకంటే ఎక్కువ సహానుభూతి నేర్పుతారని తన స్నేహితుడు మేజర్ చక్రవర్తి మాటలు గుర్తుకొచ్చాయి. చిన్నగా నవ్వుకున్నాడు.

కాఫీ మెషీన్ దగ్గర ఇద్దరు కొత్త ఉద్యోగులు మాట్లాడుకుంటున్నారు.

"అన్నా... నిన్న వరకూ ఏఐ కోర్సులు నేర్చుకోమన్నారు. ఇవాళ అవే పాతవైపోయాయంటున్నారు."

మరోవాడు నవ్వాడు.

"ఇక్కడ ఆగిపోయినవాడే ఓడిపోయినవాడు."

అంతలో వాళ్ల సీనియర్ మధు వచ్చాడు. కళ్ల కింద నల్లటి వలయాలు. చేతిలో కాఫీ కప్పు.

"సర్... మీరు ఎలా ఇన్ని ఏళ్లు సర్వైవ్ అయ్యారు?" అని వాళ్లలో ఒకడు అడిగాడు.

మధు కొద్దిసేపు వాళ్లని చూసాడు.

"సర్వైవ్ అయ్యానా?" అని మెల్లగా నవ్వాడు. "ప్రతి సంవత్సరం కొత్తగా ఇంటర్వ్యూ రాస్తున్నట్టే ఉంది."

ఆ మాట విన్నాక అందరూ నవ్వారు. కానీ ఆ నవ్వులో అలసట ఉంది.

ఆ ఆదివారం రఘు తల్లి ఫోన్ చేసింది.

"నాన్నకి ఈ మధ్య మతిమరుపు ఎక్కువైంది రా" అంది.

"ఈ వారం చాలా బిజీ అమ్మా... వచ్చే నెల చూస్తా," అన్నాడు రఘు.

అదే మాట అతను మూడునెలలుగా చెబుతున్నాడు.

కాల్ ముగిసిన వెంటనే సౌమ్య వచ్చింది.

"ఈ నెల ఈఎంఐ, స్కూల్ ఫీజు, కార్ సర్వీస్... మీ నాన్నని ఇక్కడికి తీసుకొస్తే ఎలా మేనేజ్ చేస్తాం?" అంది.

రఘు సమాధానం చెప్పలేదు.

అప్పుడే లోపలకి వచ్చిన విహాన్ బ్యాగ్ విసిరేసి లోపలికి వెళ్లిపోయాడు.

"ఏమైంది?" అని సౌమ్య అడిగింది.

"రేసులో ఓడిపోయాను" అన్నాడు విహాన్.

"పర్లేదు... నెక్స్ట్ టైమ్ ఫస్ట్ రావాలి," అంది సౌమ్య వెంటనే.

విహాన్ తల ఊపి లోపలికి వెళ్లిపోయాడు.

రఘుకి ఒక్కసారిగా చిన్నప్పటి వానలో వదిలిన కాగితపు పడవ గుర్తొచ్చింది. అప్పట్లో గెలిచిన పడవ ఏదో గుర్తు లేదు. కానీ నాన్నతో కలిసి నవ్వుకున్న సాయంత్రం మాత్రం ఇంకా గుర్తుంది.

కొన్ని రోజుల తరువాత ఆఫీసులో ప్రతి ఉద్యోగికి చిన్న మొక్క ఇచ్చారు.

"టేక్ కేర్ ఆఫ్ దిస్ ప్లాంట్. ఇట్ రిప్రజెంట్స్ యువర్ మెంటల్ వెల్‌నెస్," అని హెచ్‌ఆర్ వాళ్లు చెప్పారు.

రఘు ఆ మొక్కను ఇంటికి తీసుకొచ్చాడు.

మూడు రోజుల తరువాత అది ఎండిపోయింది.

ఒక రాత్రి నీళ్లు పోస్తూ సౌమ్య అడిగింది.

"ఇది ఎండిపోయిందేం?"

రఘు కొద్దిసేపు ఆ మొక్కని చూస్తూ నిలబడ్డాడు.

"మనకి టైమ్ లేకపోయింది" అన్నాడు మెల్లగా.

సౌమ్య ఏమీ మాట్లాడలేదు.

ఆ రాత్రి రఘుకి నిద్ర రాలేదు. బాల్కనీలో నిలబడి కింద రోడ్డును చూస్తున్నాడు. వేల కార్లు వెళ్తున్నాయి. ప్రతి కారులో ఎవరో ఒకరు ఇంకొకరిని మించి ముందుకు వెళ్లాలని పరుగెడుతున్నారు. కానీ ఎక్కడికి? ఎవరికీ స్పష్టంగా తెలియదు.

అతనికి ఒక్కసారిగా తన తండ్రి గుర్తొచ్చాడు.చిన్నప్పుడు సైకిల్ నేర్చేటప్పుడు పడిపోతే —

"నెమ్మదిగా పో... గెలవడం కన్నా పడిపోకుండా ఉండటం ముఖ్యం" అని చెప్పేవాడు.

మరుసటి రోజు రఘు అకస్మాత్తుగా రాజమండ్రికి వెళ్లాడు.

తండ్రి ఇంటి బయట పాత కుర్చీలో కూర్చుని రేడియో వింటున్నాడు. రఘుని చూసి అయోమయంగా నవ్వాడు.

"ఎప్పుడొచ్చావ్?" అని అడిగాడు.

రఘు దగ్గర కూర్చున్నాడు. ఇద్దరి మధ్య పెద్ద సంభాషణ ఏమీ జరగలేదు.

కొద్దిసేపటి తరువాత తండ్రి మెల్లగా అడిగాడు —"తిన్నావా?"

ఆ ఒక్క ప్రశ్న విన్నప్పుడు రఘుకి కళ్లలో నీళ్లు వచ్చాయి.

ఎన్నో సంవత్సరాల తరువాత అతనికి మొదటిసారి ఒక విచిత్రమైన భద్రత అనిపించింది. జీవితంలో తనను ఎవరో ఒకరు ఉపయోగం కోసం కాదు... పనితీరు కోసం కాదు... విజయాల కోసం కాదు... కేవలం మనిషిగా గుర్తిస్తున్నారనే భావన.

ఆ రాత్రి బయట వర్షం పడుతోంది. లోపల రేడియోలో పాత పాట నెమ్మదిగా వినిపిస్తోంది. తండ్రి పక్కనే నేలపై పరుపు వేసుకుని పడుకున్నాడు రఘు.

చాలా రోజుల తరువాత ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టాడు.

జీవితంలో మొదటిసారి అతనికి గెలవాలి అనిపించలేదు.

కేవలం మనిషిగా ఉండాలి అనిపించింది.

కానీ అంతలోనే మేజర్ చక్రవర్తి మాటలు గుర్తొచ్చాయి – "ఈ రోజులు మన చిన్నప్పటిలా నడిచిన వాడు నడిచినంత అనే వదిలేసే విశాలమైన రోడ్లు కావు. మనం పెద్ద పెద్ద ట్రెడ్ మిల్ మీద రకరకాల వేగాలతో నడుస్తూన్నాం. మనం ఆగితే పడిపోతాం."

చివరికి రఘుకి అర్థమైంది — మనిషిని ఓడించేది పోటీ కాదు... మానవత్వం మరిచిపోవడమే.

COMMENTS